సాక్షి
గుంటూరు
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ఆక్రమణలు తొలగింపు

పెదకూరపాడు: పెదకూరపాడులో ఆక్రమణలు గురువారం తొలగించారు. తహసీల్దారు డానియేలు, ఎంపీడీవో రామకృష్ణ పర్యవేక్షించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,07,651 క్యూసెక్కులు వచ్చిచేరుతుండి. 1,86,018 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.



రూ.ఐదు లక్షలు విరాళం

నరసరావుపేటఈస్ట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి కృష్ణవేణి డిగ్రీ కళాశాల రూ.5లక్షలను విరాళంగా ప్రకటించింది. సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేశారు.

రేపు రండి..!

"ఆధార్‌లో మార్పుచేర్పుల కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. దరఖాస్తుదారుల కష్టాలు మాత్రమే రోజూ అప్‌డేట్ అవుతున్నాయిగానీ.. వారి పని మాత్రం కావడం లేదు. రోజుల తరబడి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్యలు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. అధికారులు స్పందించి వెంటనే సవరణ కేంద్రాలు పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు."

- బ్యాంకులు, పోస్టాఫీసులకే సేవలు పరిమితం
- రోజుకు 20 - 30 మందికే అవకాశం
- మళ్లీ మళ్లీ ఆయా కేంద్రాలకు వెళ్లాల్సిందే
- విద్యార్థులకు తప్పని తీవ్ర సమస్యలు
- కళాశాలల్లో నామమాత్రంగా సేవలు
- రూ.వందల్లో ప్రతిసారీ అదనపు భారం
- ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు డిమాండ్లు

ఇదీ ఆధార్ సవరణ కేంద్రాల పనితీరు



ఆధార్ కేంద్రం (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రస్తుతం సెల్‌ఫోన్‌లో వినియోగించే సిమ్‌కార్డు కొనుగోలు మొదలు ఆస్తుల రిజిస్ట్రేషన్ వరకు ప్రతి విషయంలోనూ ప్రజల అవసరాలు ఆధార్‌తో ముడిపడి ఉంటున్నాయి. దీంతో అప్‌డేట్, తప్పుల సవరణ, మొబైల్ నెంబరు లింకేజీ కోసం నిత్యం ఆధార్ కేంద్రాలకు ప్రజలు వెళుతున్నారు. కార్డు తీసుకున్న తరువాత చిరునామా మారినా, మొబైల్ నంబరు మారినా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయించుకోవాలి. దీంతో పాటు చదువుకునే పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ఆధార్‌కు సంబంధించిన సమస్యలు పదే, పదే ఉత్పన్నమవుతున్నాయి. ఆధార్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవడంతోపాటు ఇంటి చిరునామా మార్పు, మొబైల్ నంబరు మార్పు, జనన ధ్రువీకరణ, పేరులో అక్షరాలు పొరపాటుగా పడిన వాటిని సరిదిద్దుకోవడం వంటి పనులకు ఆయా కేంద్రాల్లో గంటల కొద్దీ సమయం పడుతోంది. దీంతోపాటు ఆయా సవరణల కోసం ఒక్కొక్కరు రెండు, మూడుసార్లు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇంటి నుంచే ఆధార్ కార్డులో వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చునని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ప్రకటించినప్పటికీ అది సాధ్యపడటం లేదు.



మళ్లీ మళ్లీ వెళ్లాల్సిందే..

ఆధార్ నెంబరు కేటాయింపు అమల్లోకి వచ్చిన తొలి రోజుల్లో ప్రజలకు ఆధార్‌కు సంబంధించిన ఇబ్బందులు పెద్దగా ఎదురవ్వలేదు. అన్ని ప్రభుత్వ పథకాలకు తప్పనిసరి చేయడంతోపాటు బ్యాంకు ఖాతాకు, పాన్‌కు లింకేజీ, పాఠశాలల్లో ప్రవేశాలు, సిమ్‌కార్డు కొనాలన్నా తప్పనిసరి చేయడంతో ప్రజలు నిత్యం ఆధార్ అప్‌డేట్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఆధార్ కేంద్రాలకు ఉదయం 9 గంటలకు చేరుకున్న వారిలో 20 నుంచి 30 మంది వరకే అప్‌డేట్ కోసం దరఖాస్తులు ఇస్తున్నారు. మిగిలిన వారిని మరుసటి రోజు రమ్మని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ అపార్ పేరుతో ప్రత్యేక నెంబరు కేటాయించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 9, 10, 11, 12వ తరగతులు చదువుతున్న విద్యార్థుల వివరాలను యూడైజ్ ప్లస్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పాఠశాలల్లోని అడ్మిషన్ రిజిస్టర్, యూడైజ్ ప్లస్, ఆధార్‌కార్డుల్లో విద్యార్థుల ఇంటి పేరు సహా వివరాలు తప్పులు లేకుండా ఒకే విధంగా ఉండాలని స్పష్టం చేయడంతో ప్రస్తుతం విద్యార్థులను వెంటపెట్టుకుని తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాలకు తిరుగుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో చేరువలో సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఆధార్ సేవలు అందుబాటులోకి తేవడంతో ప్రజలకు ఎక్కడికక్కడ ఆయా సేవలను పొందడం సులభతరమైంది. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు నిలిపివేయడంతో పాటు మీ-సేవా కేంద్రాల్లోనూ అందుబాటులో ఉంచలేదు. ఎంపిక చేసిన బ్యాంకులు, పోస్టాఫీసుల్లోనే ఆధార్‌కార్డు మార్పుచేర్పులకు అవకాశం ఉంది. దీంతో ప్రజలు ఆధార్ కేంద్రాల్లో క్యూ కడుతున్నారు. దీంతో పాటు ఆధార్‌లో 2022కు ముందుగా బయోమెట్రిక్ అప్‌డేట్ కాని వారికి ప్రస్తుతం బయోమెట్రిక్ అప్‌డేట్ ఒక్కటే చేస్తున్నారు. ఇందుకు రూ.150 వసూలు చేస్తున్నారు. దీనికి వారం రోజులు వ్యవధి పట్టనుండగా, ఆధార్‌తో అనుసంధానం అయిన మొబైల్ నెంబరుకు సమాచారం వచ్చిన తరువాత మళ్లీ కేంద్రానికి రావాలని అక్కడి సిబ్బంది చెబుతున్నారు.

తప్పని ఖర్చుల భారం

బయోమెట్రిక్ అప్‌డేట్ అయిన తరువాత మళ్లీ ఆధార్ కేంద్రానికి వెళ్లి పేరులో సవరణలు, చిరునామా మార్పు తదితర వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధంగా మరోసారి రూ.150 నుంచి రూ.250 ఖర్చు చేయాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార్ కేంద్రాలు ఎక్కువగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించి, ప్రతి మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాలను ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. గుంటూరు నగరంతోపాటు పట్టణాల్లో మరిన్ని కేంద్రాలను పెంచాల్సి ఉంది. టెన్త్, ఇంటర్ పరీక్షలతోపాటు జాతీయస్థాయిలో జరిగే జేఈఈ మెయిన్స్, రాష్ట్రస్థాయిలో జరిగే ఈఏపీసెట్ తదితర పోటీ పరీక్షలకు దరఖాస్తు ప్రక్రియ మొదలు కానుండటంతో ఆధార్‌కార్డులో వివరాలను సవరించుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కేంద్రాలకు వెళుతున్నారు.

న్యూస్‌రీల్

ఈ- కేవైసీకి 9 వేల మంది రైతులు దూరం



కొరిటెపాడు(గుంటూరు): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 9 వేల మంది రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నప్పటికీ ఈ-కేవైసీ మాత్రం చేసుకోలేదు. గుంటూరు జిల్లాలో 93,072 మంది రైతులు 2,24,678.42 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారు. ఈ-కేవైసీ మాత్రం 2,14,673.72 ఎకరాలకు సంబంధించి 84,068 మంది రైతులు చేయించుకున్నారు. 9,004 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదు. పంటల బీమా వర్తింపు, రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, నష్ట పరిహారం, పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయం వంటి వాటికి రెండు ప్రక్రియలు పూర్తి కావాల్సిందే. ఈ-కేవైసీ 90.40 శాతం పూర్తయిందని, 9 వేల మంది రైతులు చేయించుకోవాల్సి ఉందని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పలుమార్లు ప్రయత్నించినప్పటికీ పలువురు స్పందించడం లేదన్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాలకు కొత్త డీఈవోలు



సీవీ రేణుక (గుంటూరు)



ఎల్. చంద్రకళ (పల్నాడు)

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు, పల్నాడు జిల్లాలకు కొత్త డీఈవోలు రానున్నారు. గురువారం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జిల్లా విద్యాశాఖాధికారుల బదిలీల్లో భాగంగా గుంటూరుకు సీవీ రేణుకను నియమించింది. ఏపీ పాఠశాల విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రేణుక గతంలో కృష్ణా జిల్లా డీఈవోగా పని చేశారు. ప్రస్తుతం గుంటూరు డీఈవోగా ఉన్న పి. శైలజకు బదిలీల్లో భాగంగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. బోయపాలెం మండలంలోని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్‌గా వైజాగ్ డీఈవో ఎల్. చంద్రకళ నియమితులయ్యారు. ఆమెకు పల్నాడు డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. పల్నాడు ఇన్‌చార్జి డీఈవోగా వ్యవహరిస్తున్న ఎం.వెంకటేశ్వర్లును అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.

గుంటూరు డీఆర్వోగా జి.శ్రీనివాసులు

గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారిగా జి.శ్రీనివాసులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీఎస్ఎస్ఎస్ కడప స్పెషల్ కలెక్టర్ పీఏగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఇక్కడకు బదిలీ చేసింది. గుంటూరులో డీఆర్వోగా పనిచేస్తున్న పెద్ది రోజాకు జీఏడీసీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు అందాయి.

ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తునకు సీసీ కెమెరాలు కీలకంగా మారాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ (పీఎస్) పరిధిలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 24 గంటలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో గతంలో ఉన్న కెమెరాల పని తీరును పునఃపరిశీలించాలని పేర్కొన్నారు. వాటి పనితీరుపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రస్తుతం చోటు చేసుకుంటున్న నేరాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నేరాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

యార్డులో 37,910 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 35,333 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 37,910 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది.

రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: రైతులందరూ ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పంట బీమా చెల్లింపులో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ నిర్వహించిన వర్చువల్ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రీమియం రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ ఆయా బ్యాంకులు ప్రీమియం మినహాయించుకుని బీమాకు మొత్తం చెల్లించడం జరుగుతుందన్నారు. సొంత పెట్టుబడితో పంటలు సాగు చేస్తున్న రైతులు మాత్రం గ్రామాల్లోని సీఎస్‌సీ సెంటర్‌కు వెళ్లి ప్రీమియం చెల్లించాలన్నారు. ఉద్యాన శాఖ అడిషనల్ డైరెక్టర్ బాలాజీనాయక్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లు, సీపీఓ శేషశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు గణన



కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జేసీ ఎ.భార్గవ్ తేజతో కలిసి గురువారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పశు సంవర్ధక శాఖ భవిష్యత్ ప్రణాళిక, విధాన రూపకల్పన కోసం దేశ వ్యాప్తంగా శుక్రవారం నుంచి 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్, జేసీ, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీఏ నరసింహారావు, డీడీ డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, అధికారులు ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సృజనాత్మకత పెంచేలా యువజనోత్సవాలు



ఓ విద్యార్థిని నృత్య ప్రదర్శన



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ: యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేలా యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరగనున్న యువజనోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరయ్యారు. అనంతరం ప్రసంగిస్తూ.. సమష్టితత్వాన్ని ఈ ఉత్సవాలు పెంపొందిస్తాయన్నారు. యువకులు విద్యతోపాటు క్రీడలు, కళ రంగాలలోనూ రాణించాలని సూచించారు. అప్పుడే పరిపూర్ణత సాధించగలరని పేర్కొన్నారు. కళా రంగంలో ప్రతిభ చాటిన వారికి ఇతర రంగాలలోనూ విజయాలు సొంతం అవుతాయన్నారు. వ్యక్తిగతంగా, సమష్టిగా సాధించే విజయాలు సమాజాన్ని మేల్కొలిపేలా ఉంటాయని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన థియేటర్, సినీ ఆర్టిస్టు, పారిశ్రామికవేత్త డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు మాట్లాడుతూ.. భావితరాలకు నేటి విద్యార్థులు పునాదిరాళ్ల వంటి వారన్నారు. యువత సమాజానికి వెలుగు అని, వారు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని పేర్కొన్నారు. కృషి, పట్టుదల, నిజాయతీ, అంకితభావం ఉంటే విజయాలు తప్పక సొంతం అవుతాయన్నారు. ఉత్సవాల వంటి అవకాశాలు సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువుల పేరు నిలిపేలా నడుచుకోవాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె. రత్న షీలామణి మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరిగే యువజోత్సవాలు సాంస్కృతిక, సాహిత్య, కళా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వేదికగా పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ కళలతో మానసిక ప్రశాంతతతోపాటు సమాజ వికాసానికి తోడ్పాటు అందించాలని సూచించారు. యువజనోత్సవాల కో ఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలోని 30 కళాశాలల నుంచి విద్యార్థులు వేడుకల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అడిషనల్ కో ఆర్డినేటర్ ఆచార్య పి.జాన్సన్, ప్రిన్సిపల్స్ ఆచార్య సిద్ధయ్య, ఆచార్య ప్రమీలారాణి, డిగ్రీ పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య ఎస్వీ కృష్ణారావు, ఆచార్య త్రిమూర్తిరావు, ఆచార్య ధనలక్ష్మి, ఆచార్య ఇ.మాధవి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తొలిరోజు పలు అంశాల్లో పోటీలు ఆసక్తికరంగా సాగాయి.

మిర్చియార్డులో విజిలెన్స్ తనిఖీలు



ఉద్యోగులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి సూర్యశ్రావణ్‌కుమార్

నగరంపాలెం: గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డి.సూర్యశ్రావణ్‌కుమార్ గురువారం మిర్చి యార్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై స్పందనలో భాగంగా యార్డులో ఆయన కలియతిరిగారు. యార్డుకు సరుకు వచ్చినప్పటి నుంచి బయటకెళ్లే వరకు జరిగే కార్యకలాపాలపై ఆరా తీశారు. ఉద్యోగులతో మాట్లాడి, ఈ నామ్ పోర్టల్‌లో చేసే ఎంట్రీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలకలూరిపేట రోడ్డులోని కొండవీడు కోల్డ్ స్టోరేజ్‌ను సందర్శించారు. అక్కడ నిర్వర్తించే కార్యకలాపాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో సీఐలు కె.చంద్రశేఖర్, పి.శివాజీ పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న డయేరియా



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దాచేపల్లి : కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత తాగునీరు, పారిశుద్ధ్యం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దాచేపల్లి అంజనాపురం కాలనీలో వాంతులు, విరేచనాలతో ప్రజలు మంచం పడుతున్నారు. డయేరియాతో ఇద్దరు మృతి చెందగా మరో 14 మంది చికిత్స పొందుతున్నారు. కాలనీలో నివాసం ఉంటున్న బండారు చిన్న వీరయ్య, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ డయేరియా బారిన పడి మృత్యువాతపడ్డారు. 14 మంది బాధితుల్లో కార్తీక, శాంతమ్మ, దుర్గారావు, సైదారావుల ఆరోగ్య పరిస్థితి కొంత ఇబ్బందికరంగానే ఉన్నది. ఎప్పుడు ఎటువంటి వార్త వినాల్సి వస్తుందో అని కాలనీ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురౌతున్నారు.

కాలనీలో పడకేసిన పారిశుద్ధ్యం

అంజనాపురం కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. పేరుకే నగర పంచాయతీలో ఈ కాలనీ ఉన్న ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఈ కాలనీలో వీధులు బురదమయంగా ఉన్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవటం వలన మురుగు రోడ్లపైనే పారుతోంది. కాలనీ ప్రజలకు తాగునీరు అందించే పైపులైన్లు మురికి కుపాల్లోనే ఉన్నాయి. తాగునీటి బోరులోకి మురుగు నీరు, సెప్టిక్ ట్యాంక్‌లోని నీరు చేరటం వలన కలుషితం అవుతున్నాయి. దీంతో ప్రజలు వాంతులు, విరేచనాల బారినపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బోరుకున్న పైపులైన్లను తొలగించి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కలుషితం అవుతున్న బోరుకి కనెక్షన్ ఇచ్చినట్లుగా కాలనీవాసులు చెబుతున్నారు. ఈ బోరు నుంచి వచ్చే నీరు తాగటం వలనే మాకు ఈ పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి



డయేరియా మరణాలకు ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియాతో ఇద్దరు మృతి చెందటం పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డయేరియాతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 14 మంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రాజధానిలో రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక కేంద్రాలు



ప్లాట్ల పత్రాలు అందజేస్తున్న సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: రాజధాని నిర్మాణం కోసం ఏపీసీఆర్‌డీఏ భూ సమీకరణ పథకంలో భూములిచ్చిన రైతుల కోసం రిటర్నబుల్ ప్లాట్ల రిజస్ట్రేషన్‌కు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. విజయవాడ ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో రెండవ రోజు లాటరీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సౌకర్యవంతంగా ప్రభుత్వం 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల్లోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాన్నారు. ఈ-లాటరీకి హాజరైన రైతులకు అదనపు కమిషనర్ నేతృత్వంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస మరియు వాణిజ్య ప్లాట్లకు తొలుత ట్రయల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు వారికి భౌగోళికంగా ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించేందుకు ప్రత్యేకంగా గ్రామ సర్వేయర్లను నియమించినట్లు తెలిపారు. చివరి రోజు జరిగిన లాటరీలో 9 గ్రామాలకు సంబంధించి 71 మంది రైతులకు 98 నివాస, 72 వాణిజ్య ప్లాట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సీఆర్‌డీఏ ల్యాండ్స్ డైరెక్టర్ బీఎల్ఎన్ రాజకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వి. డేవిడ్ రాజు, జి. భీమారావు, కె.స్వర్ణమేరి, జి.సాయి శ్రీనివాస నాయక్, తహసీల్దార్ అరుణా దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా
తెనాలి మార్కెట్‌యార్డులో
గురువారం నిమ్మకాయల క్వింటా ధర


కనిష్ఠం : రూ. **2,000**
గరిష్ఠం : రూ. **3,000**
మోడల్ ధర రూ. **2,600**

27న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను గుంటూరు నగరంలోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు టి.జాన్‌బాబు, బి. ప్రసాద్, జి. వెంకటరావు, ఇ.అనిల్‌కుమార్, బి. శంకర్‌సింగ్, ఎస్ఎం సుభానీ, టీఆర్ రమేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







ప్రతిభ చాటి.. కళల్లో మేటి..

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరగనున్న యువజనోత్సవాలు గురువారం సందడిగా ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరిధిలోని 30 కళాశాలల నుంచి విద్యార్థులు ఈ వేడుకల్లో పాలుపంచుకుంటున్నారు. తొలిరోజు జరిగిన వివిధ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభను చాటారు. – ఏఎన్‌యూ

హోం మంత్రి స్పందించకపోవడం దారుణం

- సహానా కుటుంబానికి ఆర్థిక సాయం పెంచాలి
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్



సహానా కుటుంబసభ్యులతో మాల్యాద్రి తదితరులు

తెనాలి: తెనాలికి చెందిన సహానా హత్య ఘటనపై హోం మంత్రి అనిత ఇప్పటివరకు స్పందించకపోవడం శోచనీయమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అన్నారు. పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి గురువారం తెనాలి వచ్చిన మాల్యాద్రి... స్థానిక హయ్యర్‌పేటలోని సహానా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... మహిళలపై జరుగుతున్న హత్యాచారాలు, దాడులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవటం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. సహానా కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. రౌడీ షీటర్ నవీన్ కొట్టిన దెబ్బల కారణంగా సహానా మృతి చెందిందని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. నిర్భయ చట్టం అమలు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కూడా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించాలని కోరారు. 2014లో మాదిరిగా జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను అమలు పరచాలన్నారు. ప్రభుత్వం ముందుకొచ్చి సహానా కుటుంబానికి మరింత ఆర్థిక భరోసా ప్రకటించాలన్నారు. ఆ కుటుంబానికి రూ.50 లక్షలు, అయిదెకరాల పొలం, ఇల్లు, ఇంటిస్థలం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇరువురు అక్కచెల్లెళ్లలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే పలు ప్రజా సంఘాలతో కలసి ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఎం తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, పి.జోసేఫ్, మహిళా సంఘం నాయకురాలు ఎస్.రాజ్యలక్ష్మి, అంబేడ్కరైట్ యండ్రపాటి అశోక్, కారుమంచి జాకబ్ ఉన్నారు.

‘గ్రూప్‌-ఏ’ ఘన విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ అండర్‌–19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌ల్లో భాగంగా నిర్వహించిన తొలి మ్యాచ్‌లో గ్రూప్‌–ఏ జట్టు 79 పరుగుల తేడాతో గ్రూప్‌–బి జట్టుపై ఘనవిజయం నమోదు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 76 పరుగులతో వెనుకబడ్డ గ్రూప్‌–ఏ జట్టు రెండవ ఇన్నింగ్‌లో 246 పరుగులు సాధించింది. దీంతో 171 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన గ్రూప్‌–బి జట్టును 91 పరుగులకే ఆలౌట్ చేసి గ్రూప్‌–ఏ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసుకొంది. నిన్నటి ఓవర్‌నైట్ స్కోర్ ఒక వికెట్ నష్టానికి 14 పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించిన గ్రూప్‌–బి జట్టు 91 పరుగులకు ఆలౌట్ అయింది. గ్రూప్‌–ఏ జట్టుకు 6 పాయింట్లు లభించాయి.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్‌–14 హ్యాండ్‌బాల్ పోటీలను ఈ నెల 26–28వ తేదీల్లో తెనాలిలో నిర్వహించనున్నారు. స్థానిక అమరావతి ప్లాట్స్‌లోని డీఎస్ఏ స్టేడియంలో జరిగే ఈ టోర్నమెంటుకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం తెనాలిలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎం.రవి వివరాలను తెలియజేశారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలురు, బాలికలు, క్రీడాధికారులు కలిపి మొత్తం 500 మంది హాజరుకానున్నట్టు తెలిపారు. 26వ తేదీ ఉదయం 9 గంటలకు టోర్నమెంటు ప్రారంభోత్సవంలో మంత్రి నాదెండ్ల మనోహర్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొంటారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్ వినయ్‌కుమార్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, కోచ్ నాగరాజు, కిషోర్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన వైవీ సుబ్బారెడ్డిని గురువారం పార్టీ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలు తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.



వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ కూడా గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – పట్నంబజారు/ తాడికొండ

కేఎల్‌యూ విద్యార్థికి జాతీయ అవార్డు



వరుణ్‌ను అభినందిస్తున్న డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మిస్టర్ ఇండియా పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ... కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం విద్యార్థి కొత్తపల్లి వరుణ్ చౌదరి ఈ నెల 19, 20వ తేదీల్లో గౌహతిలో జరిగిన మిస్టర్ నార్త్, ఈస్ట్ ఇండియా పోటీలలో పాల్గొని సెకండ్ రన్నర్‌గా నిలిచాడని తెలిపారు. గతంలో రాయల్ మిస్టర్ ఇండియా టైటిల్‌ను సొంతం చేసుకున్నట్లు గుర్తుచేశారు. వరుణ్‌ను కేఆర్ఎస్ ప్రసాద్‌తోపాటు వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

ఆర్టీసీ ఈడీ తనిఖీలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) గిడుగు వెంకటేశ్వరరావు గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డిపో 1, 2 పరిధిలో తనిఖీలు నిర్వహించి, ప్రయాణికులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. సలహాలు, సూచనలు స్వీకరించారు. ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్‌తో కలిసి బస్టాండ్ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. స్టాల్స్, హోటల్స్‌లో రేట్లు పట్టికలు ఉండేలా చూడాలని, నాణ్యమైన వస్తువులు విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. గ్యారేజీలో సిబ్బంది బస్సులను సమయానికి అందించాలని, ‘‘0’’ బ్రేక్ డౌన్స్ ఉండేలా చూడటంతో పాటు, టైర్ లైఫ్ 2.30లక్షల కిలోమీటర్లు తిరిగేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంపొందించాల్సిన బాధ్యత సిబ్బంది, అధికారులపై ఉందన్నారు. బస్టాండ్‌లో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. రీజియన్ పరిధిలోని గుంటూరు 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్తీక మాసం నేపథ్యంలో ఆయా శైవ క్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం సర్వీసులు వేయాలని ఆదేశించారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలి



మాట్లాడుతున్న బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించిన 12వ పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్య సభ్యుల సమావేశంలో బసవ లింగారావు మాట్లాడుతూ.. పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతోపాటు ఐఆర్ ప్రకటించాలన్నారు. గతేడాది జూలై ఒకటో తేదీ నుంచి నూతన వేతన సవరణను అమల్లోకి తేవాల్సి ఉండగా, ఇప్పటి వరకు కమిషన్ చైర్మన్‌ను నియమించకపోవడం దారుణమన్నారు. 90 నెలలకు సంబంధించిన డీఏ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఏడు నెలల నుంచి రూ.100 కోట్ల పీఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఉద్యోగ విరమణ అనంతర ప్రయోజనాలు, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంటు తదితర బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్, జిల్లా కమిటీ సభ్యులు పి. నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, ఎస్ఎస్ఎన్ మూర్తి, జి. దాస్, చక్కా వెంకటేశ్వర్లు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

27న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఈశ్వరరావు తదితరులు

తెనాలి: పేదలకు రెండెకరాల సాగుభూమిని పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్‌తోపాటు జాతీయ ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, దినసరి వేతనం రూ.600 చెల్లించాలని కోరుతూ ఈ నెల 27వ తేదీన మండల కేంద్రమైన దుగ్గిరాలలోని బీబీ కల్యాణ మండపంలో సంఘం గుంటూరు జిల్లా సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం సమావేశం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉపాధి హామీ పనులను కార్మికుల చేత చేయించాలని, యంత్రాలను ఉపయోగించరాదనే అంశాలను సమావేశంలో చర్చించి.. భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకురాలు వై.కోటేశ్వరి, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఫిర్యాదులపై విచారణ



డీసీ విచారణలో వివరాలు చెబుతున్న అర్చకులు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానంలో ఈవో, ప్రధాన అర్చకులపై వచ్చిన ఫిర్యాదులపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.బి. శ్రీనివాసరావు గురువారం విచారణ చేపట్టారు. మహిళల పట్ల ఇరువురు అర్చకులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఇటీవల నిర్వహించిన మహా కుంభాభిషేకం దేవదాయ శాఖ అనుమతులు లేకుండా చేశారని పట్టణానికి చెందిన పలువురు భక్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారులు, ఆలయ అర్చకులకు మధ్య వాగ్వాదం జరగడంతో డీసీ ఇరు వర్గాలను మందలించారు. అనంతరం డీసీ విలేకరులతో మాట్లాడారు. సుమారు 25 ఫిర్యాదులు అందాయని తెలిపారు. విచారణ అనంతరం పూర్తిస్థాయి నివేదికను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి గుంటూరు ఎంపిక పోటీలు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ క్రీడల ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక పోటీల వివరాలను గురువారం స్కూల్ గేమ్స్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ప్రకటించారు. పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఆయా క్రీడల సమయంలో ఉదయం 9 గంటలకు తగిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

తేదీ	క్రీడలు	విభాగం	ప్రదేశం
అక్టోబర్ 25	కబడ్డీ	అండర్‌-17(బాలురు)	జడ్పీ హైస్కూల్, చినకాకాని
అక్టోబర్ 25	యోగా	అండర్‌-17 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, రావెల
అక్టోబర్ 26	యోగా	అండర్‌-14 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్. పెనుమాక
అక్టోబర్ 26	బాల్ బాడ్మింటన్	అండర్‌-14, అండర్‌-17 (బాలురు)	జడ్పీ హైస్కూల్, పసుమర్రు
అక్టోబర్ 26	స్విమ్మింగ్	అండర్‌-14, అండర్‌-17 (బాల బాలికలు)	ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల, నరసరావుపేట
అక్టోబర్ 28	అథ్లెటిక్స్	అండర్‌-14 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, సిరిపురం
అక్టోబర్ 28	ఖోఖో	అండర్‌-17 (బాల బాలికలు)	జడ్పీ హైస్కూల్, నకరికల్లు
అక్టోబర్ 29	బాల్ బాడ్మింటన్	అండర్‌-14, అండర్‌-17 (బాలికలు)	జడ్పీ హైస్కూల్, శావల్యాపురం
అక్టోబర్ 30	సాఫ్ట్‌బాల్	అండర్‌-17 బాల బాలికలు	జడ్పీ హైస్కూల్ , రావెల

నకిలీ బ్రాండెడ్ సిగరెట్లు స్వాధీనం





మిని లారీ, సిగరెట్లను స్వాధీనం చేసుకున్న దృశ్యం

లక్ష్మీపురం: నకిలీ బ్రాండెడ్ సిగరెట్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి సారథ్యంలో యాంటీ ఎవేషన్ అధికారులు గురువారం ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్ వద్ద ఇన్వాయిస్‌ను పరిశీలించగా అందులో అగ్గిపెట్టెలు ఉన్నట్లు ఉంది. వాటి విలువ రూ.2.77 లక్షలుగా చూపించారు. లారీలో ఉన్న 46 పాలీ బ్యాగులను విప్పి చూడగా మొత్తం రూ.11.04 లక్షల విలువైన సిగరెట్లు లభించాయి. జీఎస్టీ చెల్లించలేదని నిర్ధారణ అవటంతో సిగరెట్లు, లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సిగరెట్ల మార్కెట్ విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నకిలీ బ్రాండెడ్ ఉత్పత్తులుగా నిర్ధారించారు. యాంటీ ఎవేషన్ అధికారులు బి.లక్ష్మీనారాయణ, జి.రవికుమార్, ఎం.నాగరాజు , గాదె శ్రీనివాసరెడ్డి, నవీన్ రాజు, యుగంధర్, టీవీజీకే మూర్తి పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

- నిందితుల నుంచి 22.5 కిలోల గంజాయి స్వాధీనం
- కార్మికులు, కళాశాల విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు

చేబ్రోలు: ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు, కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్న నలుగురు నిందితులను చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి. వెంకట కృష్ణలు వెల్లడించిన వివరాల మేరకు... గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలోని గజవెల్లి స్పిన్నింగ్ మిల్లు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 22.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నవనంపాడు గ్రామానికి చెందిన కోటిపల్లి రాజా, వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన నీలా థామస్, ఒడిశా రాష్ట్రం మాపోడర్ గ్రామానికి చెందిన సంతోష్ గౌడ్, పొన్నూరు పట్టణం డఫ్‌పేటకు చెందిన షేక్ ఫజల్‌లు గంజాయి తాగడానికి అలవాటు పడ్డారు. ఆపై సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని తీసుకొచ్చి చిన్న పొట్లాలుగా చేసి విక్రయిస్తున్నారు. చేబ్రోలు, తెనాలి మండలాల్లోని స్పిన్నింగ్ మిల్లులలో పనిచేసే కార్మికులకు, నిరుద్యోగులకు, ఇంజినీరింగ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, యువకులకు విక్రయించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులకు అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ డి వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విధుల నుంచి తొలగింపు అన్యాయం

దాచేపల్లి: డ్వాక్రా విధుల నుంచి యానిమేటర్లను తొలగించటం అన్యాయమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు అన్నారు. దాచేపల్లి మండలవ్యాప్తంగా 18 మంది యానిమేటర్లను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తొలగించారు. వీరిని తొలగించటాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మసీద్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఏపీఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఏపీఎం రవికుమార్‌కి వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకి కూడా వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే యరపతినేని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా యానిమేటర్లుగా పనిచేస్తున్న 18 మందిని అక్రమంగా తొలగించారని, వీరిని తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యానిమేటర్లు సుమతి, లూకయ్య, మరియమ్మ, మేరి, దానమ్మ, అచ్చయ్య, శైలజ, హైమవతి, వరలక్ష్మి, రమాదేవి, తేజ తదితరులు పాల్గొన్నారు.